మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# వంటేరు జోక్యంతో సద్దుమణిగిన మున్సిపల్ అవిశ్వాసం

**-పాలకవర్గ సభ్యులతో వంటేరు చర్చలు**

**-సాధారణ సమావేశానికి హాజరైన పాలకవర్గ సభ్యులు**



మున్సిపల్ సాధారణ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాజమౌళి

**గజ్వేల్, మార్చి 11 (ప్రభాతవార్త):**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళిని తొలగించాలని గతంలో పాలకవర్గ సభ్యులు సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం అందించడం జరిగింది. గత వారం పది రోజుల నుండి జిల్లా కలెక్టర్ అవిశ్వాసానికి తేదీ ప్రకటించకపోవడంతో మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి జోక్యం చేసుకొని పాలకవర్గ సభ్యులతో చర్చలు జరిపినట్లు సమాచారం. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో అవిశ్వాసం గురించి ఎవరూ మాట్లాడవద్దని స్వయంగా మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాలకవర్గ సభ్యులను పిలిపించి మాట్లాడినట్లు తెలిసింది. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఇలాఖాలో చైర్మన్‌పై అవిశ్వాసం జరిగితే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రభావం ఉండబోతుందని, అందుకే ముందుగానే బిఆర్‌ఎస్ బడా నాయకులు పాలకవర్గ సభ్యులను సముదాయించినట్లు తెలిసింది.

**మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి అధ్యక్షతన సోమవారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా పాలకవర్గ సభ్యులు అందరూ హాజరయ్యారు. ఎజెండాలో 35 అంశాలు ప్రవేశపెట్టగా 16 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించి మిగిలిన అంశాలను వాయిదా వేశారు. బడ్జెట్ సమావేశంలో గైర్హాజరైన పాలకవర్గ సభ్యులు సాధారణ సమావేశంలో అందరూ హాజరుకావడం పట్ల మున్సిపల్ చైర్మన్ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, వైస్ చైర్మన్ జకియొద్దీన్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి : కలెక్టర్ వల్లూరు క్రాంతి

**సంగారెడ్డి టౌన్, మార్చి 11, ప్రభాతవార్త:**
ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న ధరఖాస్తులను అధికారులు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయా ప్రాంతాల ప్రజలు 100 ఆర్జీలను చేసుకున్నారన్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు చేసుకున్న ధరఖాస్తులను అధికారులు పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టరన చంద్రశేఖర్, మాధురి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ధరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

# భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

**సిద్దిపేట రూరల్, మార్చి 11, ప్రభాతవార్త :**
చిన్నకోదూరు మండలంలో రైల్వే లైన్ ఏర్పాటు భూసేకరణ, మెదక్-ఎలుకతుర్తి జాతీయ రహదారి నిర్మాణంలో కోహెడ మండలం బస్వాపూర్, హుస్నాబాద్ మండలం పందిళ్ల వద్ద భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను అదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. రానున్న పార్లమెంటు ఎన్నికల నిర్వహణ కోసం ఎలాంటి ఇబ్బంది కలగకుండా పోలింగ్ కేంద్రాలలో వసతులను సరి చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ అవసరమైన చోట ప్రతిపాదనలు పంపాలని అదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి జిల్లాకు వచ్చే ప్రజా దర్బార్ దరఖాస్తుల డిస్పోజల్ వివరాలను ఎప్పటికప్పుడు అన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో అర్డీఓ బెన్‌షాలేం, కలెక్టరేట్ ఏవో రెహమాన్, తహాశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్‌లో మహిళా, శిశు దివ్యాంగులు, వయో వృద్దుల శాఖ అధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం అధ వ్ర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అత్మవిశ్వాసంతో అకాశమే హద్దుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. నా ఎదుగుదలలో మా అమ్మ ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. అనంతరం ఉత్తమ అంగన్‌వాడీ టీచర్స్, అయాలను జిల్లా కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి, బీసీ సంక్షేమ అధికారి సరోజ, డిపివో దేవకీదేవి, జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, సెట్విన్ అధికారి అమీనా, ఐసిడిఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట ఆధ్యాత్మికతను ఒడిసి పట్టిన నెల

**-అధ్యాత్మిక..దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది**

**-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
అధ్యాత్మిక..దైవ చింతనతో ఏంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని.. ప్రసన్నంజనేయ స్వామి అలయం దిన దినం అభివృద్ధి చెందడంతో సంతోషంగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీ ప్రసన్నంజనేయస్వామి అలయంలో సోమవారం శ్రీరామ కళ్యాణ మండపాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవార్చుకోవాలన్నారు. సిద్దిపేట అధ్యాత్మికతను ఒడిసి పట్టిన నెల అన్నారు. భవిష్యత్‌లో అలయ అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. అంతకు ముందు అలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ నిర్వహకులు హరీష్‌రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అలయ అర్చకులు, బిఅర్‌ఎస్ నాయకులు రాజనర్సు సాయిరాం, కాటం రఘురామ్, పూజల చిన్న తదితరులు పాల్గొన్నారు.

అనంతరం చిన్నకోదూరు మండలం పెద్దకోదూరులో పెద్దకోదూరు, చంద్లాపూర్ గ్రామాల 300 మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ రోజాశర్మ, ఎంపిపి కూర మాణిక్యరెడ్డి, బిఅర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గత పాలకుల నిర్లక్ష్యమే నాలుగు మండలాల నిరుద్యోగులకు శాపం...!

**-నాలుగు మండలాల నిరుద్యోగులకు న్యాయం చేస్తాం**

**-జరిగిన నిర్లక్ష్యాన్ని డిప్యూటి సిఎం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**-సిఎండితో మాట్లాడి సమస్యను పరిష్కరించడం పట్ల నిరుద్యోగుల హర్షం**

**హుస్నాబాద్, మార్చి11, ప్రభాతవార్త**
గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గత పాలకుల వ్యక్తిగత అవసరాల కోసం హుస్నాబాద్ నియోజకర్గాన్ని మూడు ముక్కలు చేయడంతో పాటు హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాలను సిద్దిపేట జిల్లాలో కలపడంతో ప్రస్తుతం విడుదలైన ది సింగరేణి కలరీస్ కంపని లిమిటెడ్ ఉద్యోగ నియామకాల్లో ఈ ప్రాంతంలోనే స్థానికంగా ఉన్న నిరుద్యోగులు నాన్‌లోకల్ కోటాలో వస్తుండడంతో తమకు నియామకాల్లో అన్యాయం జరుగుతుందని లోకల్ కోటాలో 95శాతం ఉద్యోగాలు ఉంటే నాన్ లోకల్ కోటాలో పడిన తమకు కేవలం 5శాతం ఉద్యోగాలకు మాత్రమే అర్హులమవుతున్నామని ఇటీవల మంత్రి హుస్నాబాద్ పర్యటనలో తెలపగా వెంటనే స్పందించిన మంత్రి ఈ విషయాన్ని సోమవారం రోజున రాష్ట్ర డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క దష్టిక తీసుకెళ్లడంతో వెంటనే బట్టి విక్రమార్క సింగరేణి సిఎండితో మాట్లాడినట్లు ప్రభాకర్ తెలిపారు. సింగరేణిలో ఉద్యోగాలలో స్థానికత కోల్పోయిన నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. దింతో సింగరేణి పరిధిలో ఉన్న నాలుగు జిల్లాలు ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంల నిరుద్యోగ యువతకే అవకాశం ఉంటుండగా ప్రస్తుతం హుస్నాబాద్ నియోజవర్గంలోని నాలుగు మండలాల నిరుద్యోగులకు సైతం న్యాయం జరుగుతుందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. స్థానిక కోల్పోతున్న తాము సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లగానే పరిష్కరించిన మంత్రి పొన్నంతో పాటు భట్టి విక్రమార్కలకు నిరుద్యోగ యువత ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మున్సిపల్ తాగునీరు పంటపోలాలకు...

**-సిబ్బంది చేతివాటంతోనే పక్కదారి పడుతున్న వైనం...?**

**-పట్టించుకోని అధికారులు**



మున్సిపల్ మోటారు నుండి పంటపోలాలకు నీరు వెలుతున్న దృశ్యం

**చేర్యాల, మార్చి 11, ప్రభాతవార్త**
అసలే ఎండకాలం మనుషులకే కాదు పక్షులకు కూడా నీరు దొరకని విధంగా ఎండలు మండుతున్నాయి. త్రాగునీరులేక కొన్ని వీధుల్లో ప్రజలు అల్లాడుతున్నారు. మరో పక్క పంటపొలాలు కూడా ఎండిపోతున్నాయి. కాని ప్రభుత్వానికి సంబంధించినదేదైనా కొందరికే కాదు అందరికి కూడా ఉపయోగపడే విధంగా ఉండాలి కాని కొంత మంది వారి స్వతాగా ఉపయోగించుకునే విధంగా వ్యవహరించడం తప్పెనని చెప్పక తప్పదు. చేర్యాల మున్సిపల్ పరిధిలోని గీకురోళ్ళబావి (వాయిలొంపులు) కాలనీలో అక్కడి కాలనీ ప్రజలకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంచినీటి సౌకర్యం కొరకు ఒక మోటారును ఏర్పాటు చేయగా అందుకు విరుద్ధంగా అక్కడున్న కొందరు వ్యక్తులు తమ వ్యవసాయ పొలాలకు ఈ మోటారు ద్వారా నీటిని వాడుకుంటున్నారు. పట్టణంలో మిషన్ భగీరథ నీళ్ళు రాక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరి కొందరు తాగునీటిని వారి వ్యవసాయ పొలాలకు వాడుకుంటున్నారు. ఈ తతాంగం చూసిన మరికొందరు ఇలా ఇరవై నాలుగు గంటలు మోటరు నడిచి రిపేర్‌కు వస్తే బాధ్యులేవరని ప్రశ్నిస్తున్నారు. కాలనీ అవసరం మేరకు మాత్రమే తాగునీటిని కొరకుఉపయోగించుకోవాలే తప్పా తమ ఇష్టారాజ్యంగా మోటారును వాడితే మున్సిపాలిటీకి చిల్లు తప్పదని పలువురు చర్చించుకుంటున్నారు. ఇదంతా కూడా అధికారుల పర్యవేక్షన లేకపోవడంతోనే మున్సిపల్ సిబ్బంది కనుసన్నల్లో నడుస్తుందని అందుకు చేతివాటం ప్రదర్శిస్తేనే మంచినీరు పక్కదారి పడుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన బాధ్యులపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని తదితరులు కోరుతున్నారు.

## గ్రామ కంఠం స్థలాన్ని ప్రజా అవసరాలకు వినియోగించాలి



ప్రజావాణిలో పిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

**సంగారెడ్డి మున్సిపాలిటి మార్చి 11: ప్రభాతవార్త:**
హత్నూర మండలం శేర్‌ఖాన్‌పల్లి గ్రామంలోని గ్రామకంఠం స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన గ్రామస్థులు సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రబావాణిలో పిర్యాదు చేశారు. ఇదే విషయంపై గత నెల రోజుల క్రితం పిర్యాదు చేసినా, ఇప్పటి వరకు సంబందిత అధికారులేవరు చర్యలు తీసుకోలేదని వారు పిర్యాదులో పెర్కొన్నారు.. సర్వేచేసి స్థలంను స్వాధీనం చేసుకొని ప్రజాఅవసరాలకు ఉపయోగించాలని లేదా ఇంటిస్థలంలేని వారికి కెటాయితంచేలా చర్యలు తీసుకోవాలని వారు పిర్యాదులో కోరారు.

## శాంతి భద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్

**-హుస్నాబాద్ ఎసిపి వాసాల సతీష్**



హుస్నాబాద్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

**హుస్నాబాద్, మార్చి11, ప్రభాతవార్త**
శాంతి భద్రతల పరిరక్షణకోసమే కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు హుస్నాబాద్ ఎసిపి వాసాల సతీష్ అన్నారు. సోమవారం రోజున సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు హుస్నాబాద్ సిఐ కె శ్రీనివాస్, చేర్యాల సీఐ శ్రీనివాస్‌తో పాటు ఎసిపి పరిధిలోని ఎస్‌ఐలు తోట మహేష్, తాండ్ర వివేక్ సదువుల తిరుపతి, దామోదర్, షేక్ యూనస్ అహ్మద్ అలీ, నాగరాజుతో పాటు డివిజన్ పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు (సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్)తో కలసి హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తా నుండి వరంగల్ రోడ్డు మీదుగా మార్కెట్ రోడ్, సిద్దిపేట రోడ్డు నుండి ఎల్లమ్మ దేవాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, గాంధీ చౌరస్తా మీదుగా మల్లెచెట్టు చౌరస్తాతో పాటు ప్రధాన రహదారుల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఓటర్లు తమ ఓటు హక్కును నిర్బయంగా వినియోగించుకోవాలని ధైర్యాన్ని ప్రజలకు కల్పించడమే ఈ మార్చ్ లక్ష్యం అన్నారు. ఈ మార్చ్‌లలో హుస్నాబాద్ ఎసిపి పరిధిలోని పోలీస్ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మండుతున్న ఎండలు-సరఫరా కాని కరెంటు

**-ఎండిపోతున్న పంటలు- పరేషాన్‌లో రైతన్నలు**

**పాపన్నపేట, మార్చి 11, ప్రభాతవార్త:**
ఎండలు ఓ వైపు మండిపోతుండటం, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అధికారుల అలక్ష్యం మూలంగా నిలిపోవడంతో అన్నదాలు ఆగమైపోతున్నారు. మూడు రోజులుగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో రైతులు ఆగుగాలం కష్టించి పండించిన పంటలు ఎండిపోతున్న సంఘటన మండల పరిధిలోని కొడుపాకలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి గ్రామ రైతుల కథనం ప్రకారం...మండల పరిధిలోని కొడుపాక విద్యుత్ సబ్ స్టేషన్‌కు చెందిన ఓ ఫీడర్ స్థంభం విరిగి పోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రైతులు ఆరు గాలం కష్టించి పండిస్తున్న పంటలకు సాగు నీరు అందకపోతుండటంతో, ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజులు అవుతున్నా వ్యవసాయ అధికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో అన్నదాతలు ఆగమై పోతున్నారు. ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా కాకపోవడంతో ఫీడర్ కింద ఉన్న సుమారు 100 ట్రాన్స్ ఫార్మర్‌కు కరెంటు సరఫరా కాక ఆలయ ట్రాన్స్ ఫార్మర్‌ల పరధిలోని పంటలు ఎండిపోతుండటంతో అన్నదాలు ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే పంటలు పూర్తిగా ఎండిపోవడం ఖాయమని రైతుల దిగాలు చెందుతున్నారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా కాని విషయాన్ని ప్రభాతవార్త విద్యుత్ అధికారి నరసింహులు దృష్టికి తీసుకుపోగా మూడు రోజులుగా విద్యుత్ సరఫరా కాని విషయం వాస్తవమే అని, త్వరలోనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని నరసింహులు వివరణ ఇచ్చారు.

## మండలంలో యథేచ్ఛగా అక్రమ మట్టి రవాణా

**బెజ్జంకి, మార్చి 11, ప్రభాతవార్త :**
మండలంలో అక్రమ మట్టి రవాణా యథేచ్ఛగా సాగుతూ అక్రమ రవాణా దారులకు కాసుల పంట కురిపిస్తుంది. మట్టిని రవాణా చేసేందుకు సంబంధిత శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా టిప్పర్ల సహాయంతో అక్రమంగా మట్టిని రవాణా చేస్తూ మట్టి మాఫియాదారులు అందినకాడికి దండుకుంటున్నారు. అదివారం సెలవు దినం కావడంతో అపేవారేలేరు అనే రీతిలో మట్టి మాఫియాదారులు చెలరేగిపోతున్నారు. సోమవారం మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామ శివారులోని గుంటూరు పల్లెలోని రైతులు పొలాలను చదును చేసే క్రమంలో మట్టిని తొలగించడంతో ఇదే అసరాగా చేసుకొని రైతులకు నయానోభయనో ముట్టజెప్పి ఎలాంటి అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో టిప్పర్ల సహాయంతో మట్టిని రవాణా చేస్తూ మండలంలో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్లక అధిక ధరలకు మట్టిని అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. కాగా మండలంలో అక్రమ మట్టి రవాణాపై తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అక్రమ మట్టి రవాణా దందాను అడ్డుకుంటమన్నారు. మట్టి రవాణాకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తాను నూతనంగా మండలంలో బాధ్యతలు స్వీకరించానని ఇప్పటి వరకు తన దృష్టికి రాలేదని వెంటనే అక్రమ మట్టి రవాణాను అడ్డుకుంటామని తెలిపారు.



అక్రమంగా మట్టిని తరలిస్తున్న దృశ్యం

## అక్రమ ఇసుక రవాణ చేస్తున్న రెండులారీలు పట్టుకున్న పోలీసులు




టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న లారీలు

**సంగారెడ్డి మున్సిపాలిటి మార్చి 11: ప్రభాతవార్త:**
అక్రంగా ఇసుక తరలిస్తున్న రెండు వాహనాలను పట్టుకొని సీజ్ చేసినట్లు సంగారెడ్డి పోలీసులు తెలిపారు. హనుమాన్‌నగర్ శంకర్ నాయక్ ఫిల్టర్ బెడ్ వద్ద భుసారాన్ని తగ్గిస్తూ, అక్రమంగా మట్టిని తవ్వి వడకట్టడం ద్వారా మట్టి నుండి ఇసుకను వేరుచేస్తూ అక్రమ మార్గంలో ఇసుకను రవాణా చేస్తున్న రెండు లారీలను, సోమవారం తెల్లవారుజామున పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వారు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యాకలాపాలను అరికట్టేందుకు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు విస్తృత స్థాయిలో దాడులు నిర్వహించడం జరుగుతుందని పోలీసులు తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో అందని వైద్యం

**-రాత్రి డ్యూటీ డాక్టర్లు లేక గర్భిణీల అవస్థలు**



మాట్లాడుతున్న బాధితులు

**వెల్దుర్తి, మార్చి11 ప్రభాతవార్త:**
24 గంటలు ఆసుపత్రిలో సేవలు చేసే డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో పేద గర్భిణీలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆదివారం రాత్రి మండల కేంద్రమైన వెల్దుర్తికి చెందిన తాటి రవి భార్య పురిటి నొప్పులతో బాధపడుతుండగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అర్ధరాత్రి తీసుకురావడం జరిగిందన్నారు. రాత్రి వేళలో ఆసుపత్రిలో ఉండాల్సిన డ్యూటీ డాక్టర్లు ఎవరూ లేకపోవడంతో పాటు గేటుకు తాళం వేసి ఉండటంతో ప్రక్కన చాలా సేపు పురిటి నొప్పులతో బాధపడటం జరిగిందన్నారు. చివరకు డాక్టర్లు స్పందించడంతో గర్భిణీ గేటు వద్ద నార్మల్ డెలివరీ అయిందని, దీంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. ఒకవేళ బిడ్డ అడ్డం తిరిగి, ఇతర ఏదైనా ప్రమాదం జరిగిఉంటే తల్లీబిడ్డల ప్రాణాలు పోయేవని, ప్రభుత్వం ఒక వైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకోవాలని సూచిస్తున్నప్పటికీ ప్రభుత్వ డాక్టర్లు మాత్రం ఆసుపత్రుల్లో ఉండటం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై రాత్రి డ్యూటీ డాక్టర్‌ను ప్రశ్నించగా అర్ధరాత్రి పురిటి నొప్పులతో వచ్చిన మాట వాస్తవమే అని, తాము వచ్చి ఆసుపత్రిలోకి తీసుకెళ్లి నార్మల్ డెలివరీ చేయడం జరిగిందని, తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని వారు తెలిపారు. ఏది ఏమైనా ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలు ఉండాల్సిన వైద్య సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## దుర్గమ్మ ఆలయ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక



అలయ నూతన కమిటీ

**నంగునూర్, మార్చి 11, ప్రభాతవార్త :**
నంగునూర్ మండలం అక్కెనపల్లి గ్రామ దుర్గమ్మ అలయ నూతన కమిటీనీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలయ చైర్మన్‌గా సిల్వేరి కృష్ణ, వైస్ చైర్మన్‌గా సందబోయిన మల్లేశం, ప్రధాన కార్యదర్శులుగా అప్పీస బాబు, పసులాది నర్సింహులు, కోశాధికారిగా యాసాని రవీందర్, సలహాదారులుగా గూడ ఎల్లారెడ్డి, సంద యాదగిరి, జగ్గని బాబు, కార్యవర్గ సభ్యులుగా గుర్రం నారాయణ, వజ్జెపల్లి నర్సయ్య, కడవెర్గు రామచంద్రం, నెల్లుట్ల రాజు, సుద్దాల గణేష్, కడవెరుగు శివకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అలయ చైర్మన్ సిల్వేరి కృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో చైర్మన్‌గా ఎన్నుకున్నందులకు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. అలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలి

### -సిపియం ఆధ్వర్యంలో ఎస్‌బిఐ బ్యాంక్ ముందు నిరసన




చేర్యాల ఎస్‌బిఐ బ్యాంక్ ముందు నిరసన తెలుపుతున్న సిపియం నాయకులు

**చేర్యాల,మార్చి 11, ప్రభాతవార్త**
ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని, మోడి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వత్తాసుపలుకుతున్న ఎస్‌బిఐ చైర్మన్‌ను వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు ఎస్‌బిఐ బ్యాంక్ ముందు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం సిపియం పార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంటమావో, పట్టణ కార్యదర్శి రాళ్ళబండి నాగరాజులు మాట్లాడాతూ ఎన్నికల బాండ్ల విషయంలో జరుగుతున్న మోసాల్ని దేశంలో ప్రజాస్వామ్య వాదులందరు ఈ విధానాన్ని ఖండించాలని పిలుపినిచ్చారు. నిరసన కార్యక్రమంలో నాయకులు బండకింది అరుణ్‌కుమార్, ముస్త్యాల ప్రభాకర్, బోయిని మల్లేశం, ఆముదాల నర్సిరెడ్డి, ఇప్పకాయల శోభ, గుండ్ల రవీందర్, ఎర్రబోసు అశోక్, మెరుగోజు సత్యనారాయణ, తొడెంగల రామచంద్రం, మంచాల నారాయణ, మేరుగోజు రామచంద్రం, బుట్టి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చంద్రమోహన్

**జగదేవ్‌పూర్, మార్చి 11 (ప్రభాతవార్త):**
జగదేవ్‌పూర్ మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్ పోలీస్ సిబ్బందితో కలిసి సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులు సైబర్ నేరాల భారిన పడకుండా రక్షించాలని, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి తమ బ్యాంకు ఖాతా, ఆధార్ నెంబర్, ఓటిపి వివరాలు అడిగితే వెల్లడించవద్దని తల్లిదండ్రులకు తెలియపర్చాలని అన్నారు. యువత ప్రస్తుతం మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని, చెడు వ్యసనాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని, బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు పైబడిన వారు మాత్రమే వాహనాలు నడపాలని, 18 సంవత్సరాలలోపు విద్యార్థులు వాహనాలు నడిపినట్లయితే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. చిన్నతనంలో వివాహాలు జరిగినట్లయితే బంగారు భవిష్యత్తు పాడవుతుందని, భవిష్యత్తులో అనేక సమస్యలు ఏర్పడి అనర్థాలకు గురవుతారని, బాల్య వివాహాలు జరగకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాధవరెడ్డి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రిని కలిసిన బిజెపి మండల అధ్యక్షుడు



ఈటల రాజేందర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాంరెడ్డి

**మర్కుక్, మార్చి 11 (ప్రభాతవార్త):**
బిజెపి మర్కుక్ మండల పార్టీ అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి సోమవారం మాజీ మంత్రి, బిజెపి రాష్ట్ర నాయకుడు ఈటల రాజేందర్‌ను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ మండల పార్టీ అధ్యక్ష పదవిని తనకు కేటాయించినందుకు ఈటల రాజేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు. బిజెపి పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో బిజెపి మాజీ మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు అంజిరెడ్డి, కిషోర్‌రెడ్డి ఉన్నారు.

# వ్యవసాయ భూముల్లో భవన నిర్మాణాలు

### -మండలంలో అన్ని గ్రామల్లో ఇదే పరిస్థితి
### -చర్యలు తీసుకోవాలంటూ
### సర్వసభ్య సమావేశంలో జడ్పీటిసి వినతి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి బాలయ్య

**జోగిపేట, మార్చి 11, ప్రభాతవార్త:**
గ్రామాల్లో వ్యవసాయేతర భూమిగా మార్పు చేసుకోకుండా, గ్రామ పంచాయితీల నుంచి ఏలాంటి అనుమతులు తీసుకోకుండానే విచ్చలవిడిగా భవన నిర్మాణాలు చేపడుతున్నారని, ఇలాంటి వాటి విషయంలో చర్యలు తీసుకోవాలని అందోలు మండల జడ్పీటిసి కె.రమేష్ కోరారు. సోమవారంనాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బాలయ్య అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపుగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొందని, దీనివల్ల గ్రామపంచాయితీ ఆదాయానికి గండి పడుతుందని పేర్కొన్నారు. ఇలాంటి నిర్మాణాలను గుర్తించి వాటికి నోటీసులు అందచేయాలన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో మరియు 161 జాతీయ రహదారికి ఇరువైపులా ఎక్కడా చూసినా చెట్ల కింద మద్యం సేవిస్తున్నారని, ఇలాంటి వారిపై చర్యలు చేపట్టాలని ఎక్సైజ్ అధికారులను ఆయన కోరారు. అలాగే గ్రామాల్లో బెల్టుషాపులపై చర్యలు చేపట్టాలని కోరారు. అంతకుముందు డిసిఎంఎస్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జడ్పీటిసి మంజూరై పనులు చేయనివారు వెంటనే వాటిని పూర్తి చేయాలని, బిల్లులకోసం సంశయించాల్సిన అవసరంలేదని సూచించారు. ప్రస్తుతం సమావేశం కొనసాగుతున్న ఎంపిడివో భవనం స్థానంలో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. డిఆర్‌డిఏ ఎపిఓ సౌజన్య మాట్లాడుతూ ప్రస్తుతం తాగునీటి విషయంలో గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని, ఈ నెల 15వరకు ప్రతినిత్యం గ్రామాల్లో తాగునీటి విషయంలో ఏలాంటి ఇబ్బందులున్నా వాటిని గుర్తించి పరిష్కారం చేయనున్నట్లు తెలపారు. అంతకుముందు వివిధ శాఖల నివేదికలు అధికారులు వివరించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు. ఐ.వి.భాస్కర్, ఎంపిడిఓ రాజేశ్, డిప్యూటి తహశీల్దారు మధుకర్‌రెడ్డి, ఎంఇవో క్రిష్ణ, వ్యవసాయశాఖ ఏవో విజయరత్న, ఇరిగేషన్ వర్క్ఇన్స్‌పెక్టర్ నాగరాజు, ఆర్‌డబ్లుఎస్ ఎఇ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాలకు సాగునీరు అందించాలని రైతుల రాస్తారోకో



సాగునీటి కోసం అందోళన చేస్తున్న రైతులు

**నంగునూర్, మార్చి 11, ప్రభాతవార్త :**
మండల పరిధిలోని అక్కెనపల్లి, ఘనాపూర్ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద వాగులోకి సాగునీరు విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని రాంపూర్ క్రాసింగ్ వద్ద హన్మకొండ-సిద్దిపేట రహదారిపై బైటాయించి సోమవారం రాస్తారోకో నిర్వహించారు. తాము వేసిన పంటలకు అధికారులు తక్షణమే సాగు నీరు అందించి పంట పొలాలను కాపాడి మమల్ని అదుకోవాలని నినాదాలు చేశారు. సాగు చేసిన పంటలు నీరు లేక ఎండిపోతున్నాయని రెండు రోజుల్లో సాగునీరు అందించకుంటే పూర్తిగా ఎండిపోతాయని తెలిపారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి పెద్దవాగులోకి సాగునీరు అందించాలని లేని పక్షంలో అందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట ఎస్ఐ భాస్కర్‌రెడ్డి అక్కడికి చేరుకొని రైతులను శాంతింపచేయడానికి ప్రయత్నించిన రైతులు పట్టించుకోకుండా భీష్మించారు. ఇరిగేషన్ డీఈఈ చంద్రశేఖర్ రైతుల వద్ద చేరుకొని సాగునీరు అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు. రైతుల రాస్తారోకోతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. బిఆర్ఎస్ నాయకులు ఎద్ల సోమిరెడ్డి, కోల రమేష్‌గౌడ్‌లు రైతులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రైతులు నాగేందర్, సత్యనారాయణరెడ్డి, విజేందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, సుధాకర్, యాదగిరి, సదానందం, శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీలు అమలు కావాలంటే..బిఆర్ఎస్ ఎంపిలు గెలువాలి

### -మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు



క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ ఎంపిలు గెలవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో నిర్వహించిన పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఉద్దెర హామీలు ఇచ్చింది కానీ నగదు హామీలు..గ్యారెంటీలు పత్తాలేవన్నారు. రైతుబంధు, రుణ మాఫీ, వరి పంటకు బోనస్ అన్ని ఉద్దెర మాటలేనని తెలిపారు. మహిళలకు రూ.2500 ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ రావడంతోనే రాష్ట్రంలో కరువు వచ్చిందన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు, నీళ్ల కష్టాలు ప్రారంభమైనాయని తెలిపారు. రైతులపై కెసిఆర్‌కు ఉన్న ప్రేమ కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల పట్ల అంతటా చర్చ జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే నిలదీసే బిఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. బిజెపి ప్రభుత్వం తెలంగాణకు చేసిందేమిలేదన్నారు. కేంద్రంలోని బిజెపి తెలంగాణకు ఇవ్వని నిధులపై..రాష్ట్రంలోని కాంగ్రెస్ అమలు కానీ హామీలపై ఓటుతో బుద్ది చెబుతామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు మాణిక్యరెడ్డి, ఉమావెంకట్‌రెడ్డి, రాధాకృష్ణశర్మ, రామచంద్రం, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, రాజనర్సు, గుండు భూపేష్, మారెడ్డి రవీందర్‌రెడ్డి, రాములు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సినిమా థియేటర్ ప్రస్థానం

### -గత 60 ఏళ్లుగా కొనసాగిన లక్ష్మీ సినిమా థియేటర్ కూల్చివేత



పెద్దశంకరంపేటలోని లక్ష్మీ సినిమా థియేటర్

**పెద్దశంకరంపేట, మార్చి11 ప్రభాతవార్త:**
పెద్దశంకరంపేటలోని శ్రీ లక్ష్మీ థియేటర్ (సినిమా టాకీస్) గత 60 ఏళ్లుగా ఈ ప్రాంత వాసులను ఎంతగానో అలరించింది. ఈ సినిమా థియేటర్ ప్రస్థానం ఇక ముగియడంతో సినిమా అభిమానులను ఈ విషయం కలవరపాటుకు గురిచేస్తోంది. గత 60 ఏళ్ల క్రితం ఇక్కడ ఏర్పాటు చేసిన లక్ష్మీ థియేటర్‌ను 1996లో కూల్చి వేసి మరో థియేటర్‌ను కొత్తగా ఏర్పాటు చేశారు. అప్పటి నుండి దాదాపు 30 ఏళ్లుగా ఇక్కడ ఎన్నో ప్రతిష్టాత్మక చిత్రాలు సినిమా అభిమానులను అలరించాయి. పెద్దశంకరంపేట మండల కేంద్రంలో సినిమా థియేటర్ అంటే స్థానికులతో పాటు చుట్టుప్రక్కల మండలాలైన టేక్మాల్, పాపన్నపేట, అల్లాదుర్గం, రేగోడ్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలకు ఎంతో ఇష్టమైన థియేటర్. అలాంటి సినిమా నష్టాల పాలవడంతో యజమానులు ఈ స్థలాన్ని ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించారు. దీంతో కొనుగోలు చేసిన వారు థియేటర్‌ను కూల్చివేసి వ్యాపార వాణిజ్య భవనాలుగా మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వార్త సినిమా అభిమానులను కలవరపాటుకు గురిచేస్తోంది. ఈ సినిమా థియేటర్‌తో ఉన్న అనుబంధాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

## బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మధన్‌మోహన్‌రెడ్డి



నూతన మండల అధ్యక్షున్ని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

**హుస్నాబాద్,మార్చి11,ప్రభాతవార్త**
భారతీయ రాష్ట్ర సమితి పార్టీ హుస్నాబాద్ మండల నూతన అధ్యక్షునిగా ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు,రాములపల్లి తాజామాజీ సర్పంచ్ గంగం మధన్‌మోహన్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ,మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నేపథ్యంలో పట్టణ కేంద్రంలోని కార్యాలయంలో మధన్‌మోహన్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షులు మధన్‌మోషన్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు మండల అధ్యక్షునిగా అవకాశం కల్పించినందుకు మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌తో పాటు జిల్లా,రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మండలంలో పార్టీ బలోపేతానికి తనవంతు పాత్ర పోశిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షులు వంగ వెంకటరామిరెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ఎడబోయిన తిరుపతిరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న పలు పార్టీల నాయకులు



కాంగ్రెస్ పార్టీ తీర్థంపుచ్చుకుంటున్న దృశ్యం

**దుబ్బాక, మార్చి 11, ప్రభాతవార్త :**
దుబ్బాక పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో బిఎస్‌పి నాయకులు సల్కం మల్లేష్ యాదవ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్‌లు దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అధ్వర్యంలో తమ తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే బిఆర్ఎస్ నాయకులు భూంపల్లి భీమ్‌రావు, రామక్కపేట మాజీ సర్పంచ్ రాచకట్ల మైసరాజు, మిద్దె భూపాల్, పొన్నాల యాదగిరి పటేల్, వివిధ గ్రామాలకు చుందిన బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు చెందిన కార్యకర్తలు, మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి స్వర్గీయ మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి హయాంలోనే జరిగిందన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం దుబ్బాక నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలన్నారు. పిఎసిఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్ తదితరులు మాట్లాడారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు కొంగర రవీందర్, యేసురెడ్డి, మంద శ్రీనివాస్, శ్రీకాంత్, అకుల భరత్, మట్ట కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులా గంజాయి అమ్మకాలు

### -బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్

**హుస్నాబాద్,మార్చి11,ప్రభాతవార్త**
హుస్నాబాద్,అక్కన్నపేట మండలాల్లో గంజాయి నిత్యవసర సరుకులా అమ్మకాలు జరుగుతున్నాయని బిజెవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి కర్ణకంటి నరేష్ అరోపించారు.సోమవారం రోజున పట్టణ కేంద్రంలో మాట్లాడుతూ గ్రామాలలో యువత విపరీతంగా గంజాయికి బానిస అయిపోయారని, వారి అలవాట్లను సొమ్ము చేసుకునేందుకు గంజాయి విక్రయదారులు ఎక్కడ బడితే అక్కడే విక్రయాలు జరుపుతున్నారని.ముఖ్యంగా కిరాణా షాపులతో పాటు పాన్‌షాపులు,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను అడ్డాగా చేసుకుని యధేచ్ఛగా విక్రయాలు జరుపుతున్నా సంబందిత అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.చిన్న పిల్లలకు సిగరెట్టు అమ్మకూడదనే నిబంధనలు ఉన్నప్పటికి షాపుల నిర్వాహకులు నిబందనలు పాటించడం లేదని మండిపడ్డారు. గతంలో అంబర్,గుట్కాలు అక్రమ రవాణా చేసిన వారే దాదాపు గంజాయి రవాణా చేస్తున్నారన్నారు.ఇప్పటికైనా అధికారులు ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో బిజెవైఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

### -గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి



వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సిఐ మురళి

**గజ్వేల్, మార్చి 11 (ప్రభాతవార్త):**
మద్యం సేవించి వాహనాలు నడిపిన 45 మంది వాహనదారులకు సోమవారం గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ మురళి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని, ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. కుటుంబసభ్యులను దృష్టిలో ఉంచుకొని వాహనాలు నడపాలని సూచించారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే కుటుంబం మొత్తం రోడ్డుపైకి వస్తుందని, ఇంటి యజమాని లేని కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని, అలా నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పక ధరించాలని, హెల్మెట్ లేకుండా నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. కౌన్సిలింగ్‌కు వచ్చిన వారిని విడతల వారీగా కోర్టులో హాజరుపర్చారు.

## ఎస్‌బిఐ చైర్మన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

### -సందబోయిన ఎల్లయ్య



గజ్వేల్ ఎస్‌బిఐ బ్యాంకు ముందు నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

**గజ్వేల్ టౌన్, మార్చి 11 (ప్రభాతవార్త):**
ఎలక్ట్రోల్ బాండ్లపై సుప్రీంకోర్టుకు అందుబాటులో సమాచారం లేదని తప్పుడు సమాచారం ఇచ్చిన ఎస్‌బిఐ చైర్మన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం పార్టీ గజ్వేల్ మండల కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్ ఎస్‌బిఐ బ్యాంకు ముందు ప్లే కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, వెంకట్‌చారి, అప్జల్, నర్సింలు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### -తీగుల్ మాజీ సర్పంచ్ భాను ప్రకాష్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రావు

**గజ్వేల్, మార్చి 11 (ప్రభాతవార్త):**
పేద ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని గజ్వేల్ నియోజకవర్గ మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, తీగుల్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ కప్పర భానుప్రకాష్‌రావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని తూచా తప్పక నిలబెట్టుకోవడం జరిగిందన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో నాలుగు గ్యారంటీలు అమలులో ఉండగా నేడు 5వ గ్యారంటీ ఇందిరమ్మ ఇళ్లను లాంఛనంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి ప్రశాంత్, కొండపాక రవి, అన్నసాగర్ రవి, గోపాల్‌పూర్ స్వామి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలోని అన్ని చెరువులను కాలువల ద్వారా నింపాలి



తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

**కొమురవెల్లి, మార్చి 11, ప్రభాతవార్త :**
దేవాదుల పైపులైన్ ద్వారా తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి నీళ్లు నింపి మండలంలోని అన్ని చెరువు, కుంటలు నింపాలని సీపీఎం మండల కమిటీ అధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట అందోళన చేపట్టి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ ఎండలు ముదురుతుండడంతో భూగర్బ జలాలు తగ్గిపోయి సాగు చేసిన పంట పొలాలు ఎండిపోతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి రిజర్వాయర్‌లోకి దేవాదుల ఎత్తిపోతల పంపులను ప్రారంభించి రైతులను అదుకోవాలని లేని పక్షంలో రైతులతో ‌ s కలిసి అందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బద్దిపడగ కృష్ణారెడ్డి, తాడూరు రవీందర్, తేలు ఇస్తారి, ఉల్లంపల్లి సాయిలు, సార్ల యాదయ్య, తకడపల్లి శ్రీనివాస్, సున్నం యాదయ్య, బాలస్వామి, అరుట్ల రవీందర్, మల్కని కనకయ్య, రాంరెడ్డి, వెంకటరెడ్డి , బాల్‌రాజు, రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో పేదింటి కలలు సాకారం

### -టిపిసిసి సభ్యులు, ఎన్‌ఎస్‌యుఐ నాయకులు చంద్రం, రాజు



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు దరిపల్లి చంద్రం

**సిద్దిపేట రూరల్, మార్చి 11, ప్రభాతవార్త :**
ఇందిరమ్మ రాజ్యంలో పేదింటి కలలు సాకారం అవుతున్నాయని టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం, ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర కో-అర్డినేటర్ దాసరి రాజులు అన్నారు. సోమవారం వారు సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ యేడాది 4,16,500 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ నాయకులు కొండలవాడి సతీష్, బడేకొల్ రాకేష్ యాదవ్, మొగిలి రాకేష్, అనిల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం డైరీ ఆవిష్కరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్ తదితరులు

## తెలంగాణ బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం డైరీ ఆవిష్కరణ

**నర్సాపూర్, మార్చి 11, ప్రభాతవార్త:** తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం డైరిని జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్ సోమవారం ఆవిష్కరించారు. అదేవిధంగా తండాలో మూతబడిన పాఠశాలలను పునః ప్రారంభించాలని జిల్లా విద్యాధికారికి తెలంగాణా ఈ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం నాయకులు మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంచందరర్, మనిరామ్, గౌరవ అధ్యక్షులు ప్రతాప్‌సింగ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి చెన్నా, శ్రీనివాస్. విఠల్, బీమ్లా, పీరుసింగ్, శివరాం, రాజ్యా, రాజు, గణేశ్ పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో తైబజార్ వేలంపాట



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

**నర్సా పూర్, మార్చి 11, ప్రభాతవార్త:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిఫల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో నర్సా పూర్ మున్సిపాలిటీకి 2024-25 సంవత్సరానికిగాను తైబజార్ వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో తైబజార్‌ను రోల సందీప్ 23 లక్షల 10వేలకు పాడి దక్కించుకున్నారు. పశువుల చిట్టిని చింతకుంట శ్రీకాంత్ ఒక లక్షా 55 వేలకు దక్కించుకున్నారు. కాగా కసాయి వధశాలకు డిపాజిట్ రానందున వాయిదా వేయడం జరిగిందని మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు. తిరిగి కసాయి వధశాలకు 13 వ తేదీనా వేలం పాట నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కౌన్సిలర్ లు లతరమేశ్‌యాదవ్,. సరితా ఆంజనేయులుగౌడ్,. పంబళ్ళ లలితబిక్షపతి, మున్సిఫల్ సిబ్బంది శ్రీరామ్, నాగేశ్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేటలో తీస్రిబార్-మోదీసర్కార్ ప్లకార్డుల ప్రదర్శన



తీస్రిబార్ మోదీసర్కార్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బిజెపి నాయకులు

**జోగిపేట, మార్చి 11, ప్రభాతవార్త:** తీస్రిబార్ మోదీ సర్కార్ అంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ జోగిపేటలోని క్లాక్‌టవర్ వద్ద బిజెపి నాయకులు సోమవారం సాయంత్రం కార్యక్రమం చేపట్టారు. మోదీ హమారా పరివార్ సదస్య, హమ్ మోదీకా పరివార్ అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో బిజెపి అందోలు నియోజకవర్గ కోకన్వీనర్ మహేష్కర్ సుమన్, జోగిపేట పట్టణ అధ్యక్షులు శివశంక్, అందోలు మండలశాఖ అధ్యక్షులు శివచందర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జగన్, బూత్ అధ్యక్షులు పురం సతీష్, కొండారెడ్డి పల్లి నవీన్, వ్యాపారస్తులు గంగయ్య, కాశీనాథ్, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

## బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో జెండావిష్కరణ



తహసీల్దార్‌కు మెమొంటో అందజేస్తున్న బ్రహ్మకుమారీస్

**రామాయంపేట, మార్చి 11, ప్రభాతవార్త :** బ్రహ్మకుమారీస్ రామాయంపేట శాఖ వారు శివ ధ్వజాన్ని ఆవిష్కరించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి తహసీల్దార్ రజిని ముఖ్య అతిథిగా పాల్గొని శివ పతాకాన్ని ఎగరవేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ చేస్తున్న సమాజసేవను కొనియాడారు. విశేషంగా అనాథలకు తల్లిదండ్రుల యొక్క ప్రేమను పంచాలన్నారు. హైదరాబాద్ బ్రహ్మకుమారీస్ సంస్థ నుండి వచ్చిన అంజిలి దిది మాట్లాడుతూ శివున్ని సత్యం, శివం, సుందరం అంటారన్నారు. అయితే మనం ఎంత నిజాయితీగా సత్యంగా ఉంటే ఆ శివుని ఆశీర్వాదం మనపై ఎల్లప్పుడు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థ ఇంచార్జి బి.వి. సుజాత స్థానిక తహశీల్దార్‌కు ఈశ్వరీయ కానుకను ఇచ్చారు.

## సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి : తహసీల్దార్

**చిన్నశంకరంపేట, మార్చి 11, ప్రభాతవార్త:** ఆడపిల్లలు సమస్యలు ఎదురైతే వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని తహసీల్దార్ మన్నన్ అన్నారు. సోమవారం చిన్నశంకరంపేటలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలోని విద్యార్థులకు శారీరక ధృడత్వం, బేటి బచావో,బేటి పడావో, బాల్య వివాహాలు వంటి అంశాలపై మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నారి శక్తి రన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరుగు పందేలా పోటీలను ఏర్పాటు చేయగా అందులో గెలిచిన విద్యార్థినీలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మన్నన్ మాట్లాడుతూ విద్యార్థులు మానసీకంగా ధృడంగా ఉండాలని, ఎలాంటి అవరోధాలు ఎదురైనా బయపడకుండా ఎదుర్కోవాలన్నారు. పౌష్టికాహారం తినడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, నిత్యం వ్యాయమం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండోచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు శివకుమారి, ప్రిన్సిపల్ గీతా, భారతి, ఆర్ఐ చందు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందిస్తున్న తహసీల్దార్ మన్నన్

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

**మెదక్ మున్సిపాలిటీ, మార్చి 11 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలోని స్థానిక ఆటోనగర్‌లోని చంద్రభవన్ కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సోమవారం మహిళా మూర్తులకు చంద్రభవన్ కాలనీ అసోసియేషన్ తరపున ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చంద్రభవన్ కాలనీ అధ్యక్షులు ఎల్. దేవుల మాట్లాడుతూ మహిళలు అవని నుండి అంతరిక్షం వైపు ప్రయాణం కొనసాగిస్తున్న రోజులు అని, నేటి ఆధునిక యుగంలో అన్ని రంగాలలో మహిళలదే పైచేయి ఉండటం గర్వకారణమని, కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉండటానికి, సమాజం పటిష్టంగా ఉండటానికి, దేశం పటిష్టంగా ఉండటానికి మహిళల పాత్ర ఎంతో ముఖ్యమైందని కొనియాడారు. మన దేశం ఆడ మగ తేడా లేకుండా అన్ని రంగాలలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించినందుకు మహిళా మూర్తులు దేశాభివృద్ధిలో తమ వంతు కృషి అందిస్తున్నందుకు మహిళా మూర్తులందరికీ ధన్యవాదాలు తెలిపారు. మహిళలు వంట గదిలకే పరిమితం కాకుండా విద్యాబోధనలో, వైద్య సేవలో, సమాజ సేవలో, విద్యారంగంలో పురుషుల కంటే ముందు స్థానంలో ఉంటూ గొప్ప పేరు తెచ్చుకుంటునందుకు చాలా గర్వపడుతున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఎల్. సిద్ధిరాములు మాట్లాడుతూ భారత దేశ మహిళలందరూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ భారత దేశ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని, విద్య అన్నింటికీ మూలం కాబట్టి అమ్మాయిల అక్షరాస్యత శాతాన్ని పెంచాలని, ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు కాబట్టి దేశంలో ఎవరు కూడా అమ్మాయిలు నిరక్షరాస్యులుగా ఉండొద్దని తెలిపారు. రాజకీయ రంగంలో 33 శాతం రిజర్వేషన్లు ఉపయోగించుకొని రాజకీయ రంగంలో కూడా దేశం గర్వపడేలా దేశ అభివృద్ధి చేయాలని కోరుకుంటూ భారతదేశం మాతృమూర్తులందరికీ కూడా అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు అశోక్ కుమార్, శ్రీనివాస్, నరేందర్, వేణుమాధవ్, శ్రీధర్, నాగరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిఆర్ఎస్ యువజన నాయకులు

## డిప్యూటీ సిఎంను, మంత్రిని అవమానించడం సరికాదు

**కొండపాక, మార్చి 11, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దళితులకు సముచిత స్థానం కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక దళిత బహుజనులను అవమానపరుస్తుందని బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు దేవి నర్సింలు మండిపడ్డారు. సోమవారం అయన లకుడారంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దళితుల పక్షపాతి అని చెప్పుకోవడానికే తప్ప అచరణలో కనిపించడం లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో దళిత బహుజనులను అవమానానికి గురిచేస్తుందని చెప్పడానికి యాదగిరిగుట్ట సంఘటనే నిదర్శమన్నారు. సోమవారం ముఖ్యమంత్రి సమక్షంలోనే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి కూర్చోవడానికి కూర్చిలు వేయకుండా అవమానించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు రాజగోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి యాదగిరి గుట్ట దేవాలయంలో కూర్చిల మిద కూర్చుండి, దళితుడైన ఉప ముఖ్యమంత్రని బట్టి విక్రమార్కను, బిసి కులానికి చెందిన దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖకు కూర్చిలు వేయకుండా చిన్న పీటలపై కూర్చో బెట్టి వారిని అవమానించారని అవేదన వక్తం చేశారు. ముఖ్యమంత్రి స్థానం తర్వాత ఉప ముఖ్యమంత్రి స్థానానికి అవమానం జరిగిందన్నారు. మంత్రి పదవుల కంటే ఉప ముఖ్యమంత్రి పదవి తక్కువ అన్ని అయన ప్రశ్నించారు. గతంలో ఉప ముఖ్యమంత్రి పోటోలను ప్లెక్సిల్లో తొలగించారు ఇపుడు దేవాలయంలె అవమానించారన్నారు. ఇప్పటికైన దళిత బహుజల వర్గాలపట్ల కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులు తమవైకరిని మార్చుకోకపోతే దళిత బహుజనుల సత్తా ఎమిటో చూపిస్తామని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మారపాక శివ కుమార్, మెల్గు రాజు, మెల్గు స్వామి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## మార్వాడి యువమంచ్ సేవలు అభినందనీయం

### ఆర్‌బీఎల్ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

**తాండూరు, మార్చి 11, ప్రభాతవార్త:** మార్వాడి యువమంచ్ సేవలు అభినందనీయమని ఆర్‌బీఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం తాండూరు పట్టణంలోని బాలాజిమందిర్‌లో అఖిల భారత మార్వాడి యువమంచ్ తాండూరు శాఖ, ఆర్‌బీఎల్ సంయుక్తంగా ఉచిత కృత్రిమ అవయవాల అమరిక, క్యాలిపర్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌బీఎల్ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి హజరై ప్రారంభించారు. కోడంగల్, చిచోళి, గుల్బర్గా, వికారాబాద్, పరిగి తదితర ప్రాంతాల నుండి వికలాంగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. క్యాంప్‌లో మొదటి రోజు 100మందికి వివిద అవయవాలకు సంబందించి కొలతలు తీసుకోవడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. వీరికి ఈ నెల 13,14 తేదీల లో కృత్రిమ అవయవాలు, క్యాలిపర్స్ అందించడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎల్ డైరెక్టర్లు కల్వ అశోక్, కల్వ రాధాకృష్ణ, రాజస్థాని ప్రగతి సమాజ్ మాజీ అధ్యక్షులు మురళీధర్ గగరాణి, మంచ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సన్ని అగ్రవాల్, జాతీయ కన్వీనర్ కుంజ్ బిహరి సోని, మంచ్ అధ్యక్షులు బ్రిజ్ మోహన్‌బూబ్, కార్యదర్శి కిషన్ రాఠి, కోశాధి కారి అరున్ సాగర్, మంచ్ మాజీ అధ్యక్షులు మన్మోహన్ సారడా తదితరులు పాల్గొన్నారు.

## 2008డిఎస్సీ డిఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

**తాండూరు, మార్చి 11, ప్రభాతవార్త :** 2008 డిఎస్సీలో క్వాలిపై అయిన డిఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని సోమవారం పలువురు అభ్యర్థులు తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని వినతిపత్రం అందజేశారు. గతంలో డిఎడ్ 2007-2009 ప్రైవేట్ డిఎడ్ అభ్యర్థులు 2008 డీఎస్సీలో వెలువడిన నోటిఫికేషన్‌లో అవకాశం ఇవ్వాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగిందని అన్నారు. కానీ ప్రభుత్వం అప్పట్లో ప్రభుత్వ డిఎడ్ అభ్యర్థులకు అవకాశం కల్పించి ప్రైవేట్ డిఎడ్ అభ్యర్థులకు డిఎస్సీలో అవకాశం ఇవ్వలేదన్నారు. దింతో కొంత మంది ప్రైవేట్ డిఎడ్ అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడం జరిగిందని.. కోర్టు ఆర్డర్ ద్వారా 2008 డీఎస్సీలో కొంత మంది అభ్యర్థులు పరీక్ష రాయడం జరిగిందని తెలిపారు. 2008 డిఎస్సీలో సెలక్షన్ లిస్టు, మెరిట్ లీస్టులో అభ్యర్థుల పేర్లు ప్రకటించారని, సర్టిపికేట్స్ కుడా వేరిపికేషన్ చేయడం జరిగిందన్నారు. కానీ ప్రభుత్వం సెలక్షన్ అయిన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వకుండా విత్‌ఓల్డ్‌లో పెట్టి అన్యాయం చేసిందని వాపోయారు. ప్రస్తుతం ప్రభుత్వం స్పందించి 2008 డిఎస్సీ రాసిన డిఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థులు కవిత, స్వప్న, అనిత, రాంప్రసాద్, రఘు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## సిఐని కలిసిన విద్యార్థి సంఘం నాయకులు

**హుస్నాబాద్, మార్చి 11,ప్రభాతవార్త :** హుస్నాబాద్ నూతన సిఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.శ్రీనివాస్‌ను సోమవారం ఎన్ఎస్‌యూ (నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా) విద్యార్థి సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. సిఐని కలిసిన వారిలో ఎస్ఎస్‌యూసి హుస్నాబాద్ అధ్యక్షులు కూనం విశ్వతేజ, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొండపర్తి నగేష్, నాయకులు రంజిత్, విక్రమ్, పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం

**బోడుప్పల్, మార్చి 11 ప్రభాతవార్త:** బోడుప్పల్ నగర పాలక సంస్థ 15వ డివిజన్‌లో 54 లక్షలతో లక్ష్మారెడ్డికాలనీ మీదుగా టెలిఫోన్ కాలనీ ప్రధాన రహదారిని కలుపుతూ వేసే సిసి రోడ్డు పనులను మేయర్ సామల బుచ్చిరెడ్డి ప్రారంభించారు. అనంతరం 3వ డివిజన్ చెంగిచర్ల ప్రధాన రహదారిలో 9లక్షలతో డ్రైనేజి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు రంగా బ్రహ్మన్న, సీనియర్ నాయకులు కొత్త రవిగౌడ్, కొత్త కిశోర్‌గౌడ్, సిగురు రేణుక, సిగురు రవికుమార్, యువ నాయకులు మోతె రాజు, పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**బోడుప్పల్, మార్చి 11 ప్రభాతవార్త:** ఉప్పల్ డిపో టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హోటల్ ఎస్‌విఎం గ్రాండ్ హోటల్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.... నేటి సమాజంలో అన్నిరం గాల్లోనూ మహిళల పాత్ర కీలకంగా ఉందన్నారు. విద్య, ఉద్యోగ రంగాల తో పాటు స్వయం ఉపాధి రంగాల్లో దూసు కెళ్తున్నారని, అదే స్ఫూ ర్తితో రాజకీయ, వ్యాపార రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. సమా జం బాగుపడాలంటే మహిళల వల్లే సాధ్యమవుతుందని అన్నారు. మహిళలకు ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వి. శ్రీనివాస్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ ఏ.వనజ తాషి, శ్రీదేవి , విజయలక్ష్మి, గీత, రూహి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

### ఉప్పల్ బస్ డిపో వద్ద ముఖ్యమంత్రి, మంత్రులకు క్షీరాభిషేకం

**బోడుప్పల్, మార్చి 11 ప్రభాతవార్త:** టీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 22% పిఆర్సీ ప్రకటించిన సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు రవాణా, బిసి వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఉప్పల్ డిపో వద్ద ఉమ్మడి ఘట్కేసర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి వారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సంధర్భంగా వజ్రేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోందని,ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో రెండు గ్యారంటీ స్కీమ్స్ అమలు చేసిన సర్కా ర్.. ఇటీవల పేదలకు ఎంతగానో ఉపయోగపడే రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేసింది. ఇప్పుడు తాజాగా టీఎస్ఆర్టీసీ ఉద్యోగుల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ సంస్థ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం కొన్ని నిర్ణయాలు తీసుకు న్నామని చెప్పారు. గతంలో ప్రావిడెంట్ ఫండ్‌ను వాడుకున్నారని.. బాండ్స్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కున్నారన్నారు. ఇప్పుడు 2017 పీఆర్సీని పూర్తి స్థాయిలో ఇవ్వాలని అనుకుంటున్నట్లు చెప్పారు. దీనివల్ల ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పెట్టుకు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఘట్కేసర్ మండల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శిలు వార్డ్ మెంబర్లు,కౌన్సిలర్లు కార్పొరేటర్లు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఓబీసీ సెల్, మైనారిటీ సెల్, కంటెస్టెంట్ కార్పొరేటర్లు, నిబబీతి, సీనియర్ నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

## టిప్పర్ బైక్ ఢీ..ఒకరు మృతి

**కొడంగల్,మార్చి 11ప్రభాతవార్త** కొడంగల్ పురపాలక కేంద్రంలోని మదర్సా ఎదురుగా టిప్పర్ బైక్ ఎదురెదురుగా వస్తు ఢీకొన్న సంఘ టనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సంఘటనకు సంభందించి ఎస్సై భర త్‌రెడ్డి కథనం మేరకు..సోమవారం టీఎస్31 టి 2504 నెంబర్ గల టిప్పర్ కోస్గి వైపు నుంచి కొడంగల్ అంబేద్కర్ చౌరస్తా వైపు వెళ్తున్న సమయంలో ఏపీ22ఎల్ 8043 ద్విచక్రవాహనం రెండు ఢీకొన్నాయి. సంఘటనలో ద్విచక్ర వాహనం పై వెళ్తున్న బొంరాస్‌పేట్ మండలంలోని నాజ్‌ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి(40)కి తీవ్రంగా గాయాలైయ్యాయి. అటువైపుగా వెళ్తున్న వారు 108కు సమా చారం అందించగా క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సంఘటనపై మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ బి.ఈశ్వ రప్పపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## జాతీయస్థాయి కరాటే పోటీలలో రామాయంపేట విద్యార్థులకు పతకాల పంట



మైనంపల్లి హన్మంతరావు చేతుల మీదుగా పతకాలు అందుకున్న విద్యార్థులు

**రామాయంపేట మున్సిపాలిటీ, మార్చి 11, ప్రభాతవార్త :** జాతీయస్థాయిలో జరిగిన కరాటే పోటీలలో రామాయంపేట విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభకనబర్చి పతాకలు సాధించారని పట్టణానికి చెందిన కరాటే గ్రాండ్ మాస్టర్ రొయ్యల హరిప్రసాద్ తెలిపారు. ఈమేరకు ఆదివారం నాడు మనోహరబాద్‌లోని శ్రీ శుభం ఫంక్షన్‌హాల్ లో జరిగిన సన్‌షైన్ 2వ జాతీయస్థాయి కరాటే టోర్నమెంట్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులతో పోటీపడిన రామాయంపేటకు చెందిన 21 మంది విద్యార్థులు పతాకాలు సాధించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. అందులో 11 మంది విద్యార్థులు మొదటి బహుమతి బంగారు పతాకాలు సాధించగా, 6గురు విద్యార్థులు రెండవ బహుమతి వెండి పతకాలు, 4 గురు విద్యార్థులు మూడవ బహుమతి కాంస్య పతకాలు సాధించారు. తెలంగాణ మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు ఈ పతకాలు సాధించడంలో కృషి చేసిన పట్టణానికి చెందిన గ్రాండ్ మాస్టర్ రొయ్యల హరిప్రసాద్‌తో పాటు విద్యార్థులను మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, రెంజుంకి కరాటే వ్యవస్థాపకులు నగేష్‌మాస్టర్, తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అంతుల్ జమాల్ అశ్రాతో పాటు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు అభినందించారు.




మాట్లాడుతున్న అధికారులు

## తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

### సగానికి పైగా శాఖల అధికారులు గైర్హాజరు

**సిద్దిపేట అర్బన్, మార్చి 11, ప్రభాతవార్త :** సిద్దిపేట అర్బన్ మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగానే జరిగింది. సోమవారం సిద్దిపేట ఎంపిడివో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులతో పాటుఎ సగానికిపైగా వివిధశాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఉన్నవారితో నామమాత్రంగానే చర్చించి సమావేశాన్ని ముగించారు. గ్రామాల్లో పారిశుధ్యం, నీటి సరఫరా, విద్యుత్ సరఫరాలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని వైస్ఎంపిపి అల్లం ఎల్లం సూచించారు. గ్రామస్థాయిలో సమస్యలపై ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలని సమావేశంలో సూచించారు. ప్రతిసారి సమావేశం తూతూ మంత్రంగానే నిర్వహించడం చర్చకు వచ్చిన సమస్యలను పరిష్క రించడంలో విఫలం కావడం ఎప్పుడూ ఇదే తంతు జరుగుతుందని సభ్యులు పేర్కొన్నారు. సమావేశంలో ఎంపిడిఓ మార్టిన్ లూథర్, తహశీల్దార్ సలీం, ఎంపివో శ్రీనివాసరావు, పిఎసిఎస్ చైర్మన్ శ్రీనివాస్, ఎంపిటిసి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



ముస్లిం మోనార్టీల నూతన కార్యవర్గం

**కొంపాక, మార్చి 11, ప్రభాతవార్త :** దుద్దెడ ముస్టీం మోనార్టీ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎం డి రఫీయోద్దీన్, ఉపాధ్యక్షుడుగా జావిద్, నఇమ్, ప్రధాన కార్యదర్శిగా షాదుల్ హుస్సేన్, సహాయ కార్యదర్శిగా అస్లాం, కోశాధికారిగా హైమద్, గౌరవ అధ్యక్షులుగా అబ్దుల్ రజాక్, మొహినుద్దిన్, నవీద్, సలహాదారులుగా అబ్దుల్ నభి, ఖాజాబాయ్, జహంగీర్‌లను ఎన్నుకున్నారు.

## నర్సాపూర్‌లో ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ

**నర్సా పూర్, మార్చి 11, ప్రభాతవార్త:** పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఆర్థిక అక్షరాస్యత అనే కార్యక్రమం పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో మండలంలోని గ్రామ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆర్థిక అక్షరాస్యత పై వారికి క్లుప్తంగా వివరించి సమగ్రమైన శిక్షణనివ్వడం జరిగింది. ఈకార్యక్రమంలోఏపిఎం గౌరిశంకర్, సిసిలు భాగ్య ,సమత, రవిందం, ప్రవీణ, దేవిసింగ్, అకౌంటెట్ మల్లేషం, ఆపరేటర్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బారులు తీరిన గృహజ్యోతి లబ్ధిదారులు

**కొండపాక, మార్చి 11, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం కోసం గతంలో ప్రజాపాలవ కార్యక్రమంలో ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. కాని కొంతమందికి జీరో కరంటు బిల్లు వర్తించక పోవడంతో ప్రజలు తిరిగి గృహజ్యోతి పథకానికి దరఖాస్తులు చేసుకోవడానికి సోమవారం ఎంపిడిఒ కార్యలయానికి మండలంలోని ప్రతి గ్రామం నుండి ఎక్కువ సంఖ్యలో తరలిరావడంతో కార్యాలయం కిక్కిసిపోయింది. గృహజ్యోతి లబ్ధిదారుల నుండి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు.

## ఇతరులకు సహాయం చేయాలి

**కొండపాక, మార్చి 11, ప్రభాతవార్త :** జుక్రియెటివ్ టీచర్స్ అసోసియేషన్ అద్వర్యంలో సోమవారం మండల పరిధిలోని సిర్సనగండ్ల ఉన్నత పాఠశాలకు స్వర్గీయ గాజుల శ్రీనివాస్ జ్ఞాపకార్థం బీరువాను అందించారు. ఈ సందర్భంగా క్రియేటీవ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లింగ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తను సంపాదించిన దానిలో కొంత సమాజ సేవకు వినియోగించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు పెద కుటుంబాలకు చెందినవారు ఉంటారన్నారు. పెదలకు సేవ చేయడం అనందంగా ఉందన్నారు. గత 15 సంవత్సరాల నుండి అసోసియేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఆలయాలతోనే ఆధ్యాత్మికత : మాజీ ఎమ్మెల్యే

**చిన్నశంకరంపేట, మార్చి 11,ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందడంతోనే మానవతా విలువలు పెరుగుతాయని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. సోమవారం మండల పరిధి రుద్రారం గ్రామంలోని 75వ సంగమేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలలో సతీమణి వాణితో కలిసి పాల్గొన్నారు. సంగమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగమేశ్వరస్వామి దేవాలయ పూజారి గది నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని గ్రామస్తులు కోరగా ఆయన సానూకూలంగా స్పందించారు. షార్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా క్రీడాకారులతో ముచ్చటించి సరదాగా కాసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మీ,ఎంపిటీసీ శివకుమార్,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సాన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మనోజ్, వర్కింగ్ ప్రసిడెంట్ పడాల సిద్దిరాములు, మాజీ ఎంపీపీ అరుణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా నరేందర్, తాజా మాజీ సర్పంచి మంచాల లక్ష్మణ్, నాయకులు గోపాల్‌రెడ్డి, మైనంపల్లి రంగారావు, పోతరాజు జనార్ధన్, శ్రీమన్‌రెడ్డి, వడ్ల సిద్దిరాములు, కర్రోల్ల నాగరాజు పాల్గొన్నారు.

## పూసల చైతన్య వేదిక క్యాలెండర్ ఆవిష్కరణ

**గజ్వేల్ టౌన్, మార్చి 11 (ప్రభాతవార్త):** పూసల చైతన్య వేదిక సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మర్రి స్వామి ఆధ్వర్యంలో సోమవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి పూసల చైతన్య వేదిక క్యాలెండర్‌ను ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్, గజ్వేల్ పూసల సంఘం ప్రధాన కార్యదర్శి పొదిల ప్రకాష్ తదితరులు ఉన్నారు.

## టిఎన్‌జివో రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

**సిద్దిపేట రూరల్, మార్చి 11, ప్రభాతవార్త :** తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ రాష్ట్ర శాఖ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైనా శ్రీమారం జగదీశ్వర్‌ను సిద్దిపేట జిల్లా టిఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శి గ్యాదరి పరమేశ్వర్, కొమాండ్ల విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లులు సోమవారం హైదారాబాద్‌లో కలిసి ఘనంగా సత్కరించారు. ఉద్యోగుల సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారించడానికి కృషి చేస్తానని నూతన రాష్ట్రశాఖ అధ్యక్షులు జగదీశ్వర్ తెలిపినట్లు పరమేశ్వర్, విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఉద్యోగుల సమస్యల పట్ల అంకితభావంతో పని చేస్తూ ఉద్యోగులందరికీ న్యాయం చేసేదిశగా అడుగులువేయాలని సూచించినట్లు వారు తెలిపారు. జగదీశ్వర్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికకావడంపట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.



టిఎన్‌జివో రాష్ట్ర అధ్యక్షున్ని సత్కరిస్తున్న దృశ్యం


మార్కెట్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను సన్మానిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

## వైస్ ఛైర్మన్‌ను సన్మానించిన కాంగ్రెస్ శ్రేణులు

**న్యాల్‌కల్, మార్చి 11, ప్రభాతవార్త:** జహీరాబాద్ మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్‌గా సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన మండలలోని మెటల్‌కుంట గ్రామ మాజీ సర్పంచ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండంగారి తిరుపతిరెడ్డిని కాంగ్రెస్ నేతలు, శ్రేణులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జహీరాబాద్ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో అట్టహాసంగా జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి మండల పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరుకుని ప్రమాణ స్వీకారోత్సవాన్ని తిలకించి అనంతరం గుండంగారి తిరుపతిరెడ్డిని శాలువా, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా పాలక మండలి చొరవ తీసుకునేలా చూడాలని నాయకులు తిరుపతిరెడ్డికి సూచించారు.

## మోర్గిలో సిసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ


సిసి రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నాగల్‌గిద్ద, మార్చి 11, ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మోర్గి గ్రామంలో ఎన్ఆర్ ఈజిఎస్ పథకంలో 10 లక్షల రూపాయలతో నిర్మించే సిసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మోడల్ కళాశాలలో విద్యార్థులు నిర్వహించుకున్న వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు విద్యను క్రమ శిక్షణతో అందుకోవాలని సూచించారు. కళాశాల సిబ్బంది ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు శంకరయ్యస్వామి, నాయకులు చందుపాటిల్, గుండేరావుపాటిల్, నారాయణజాదవ్, బసవ జాజ్ స్వామి, శాంతయ్యస్వామి, ప్రిన్సిపాల్ రమేష్, ఎంపిడిఓ కవ్‌లాస్ రాజశేఖర్, ఎస్ఐ సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే


వనదుర్గా భవాని మాతను దర్శించుకుంటున్న మైనంపల్లి హన్మంతరావు

**పాపన్నపేట, మార్చి 11, ప్రభాతవార్త:** ఏడుపాయల్లో స్వయంభూవుగా కొలువున్న వనదుర్గా భవాని మాతను సోమవారం మల్కాజిగిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హన్మంతరావు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ ఛైర్మన్ బాలగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. హన్మంత్‌రావును అర్చకులు ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందించి శాలువాతో సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే వెంట కొత్తపల్లి సొసైటీ ఛైర్మన్ రమేష్‌గుప్తా, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోవింద్‌నాయక్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సుప్రభాతరావు, గంగానరేందర్, నర్సింలుగుప్త పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఆర్టీసీ కార్మికుల సంబరాలు


సంబరాలు చేసుకుంటున్న ఆర్టీసీ కార్మికులు

**సంగారెడ్డి టౌన్, మార్చి 11, ప్రభాతవార్త:** శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేసిన హామిని అధికారంలోకి రాగానే అమలు చేయడంతో ఆర్టీసీ కార్మికులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 21 శాతం పిఆర్‌సి ప్రకటించడంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రశాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కార్మికులు ధన్యవాదాలు చెబుతూ సంబరాలు చేసుకున్నారు. గత 10 సంవత్సరాలుగా ఆశతో ఎదురు చూస్తున్న కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు.

## నేత్రపర్వంగా కేతకిలో రథోత్సవం

**ఝరాసంగం, మార్చి 11, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో పార్వతీదేవి సమేతంగా కొలువున్న శ్రీకేతకి సంగమేశ్వరస్వామివారి ఆలయంలో జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా రథోత్సవ యాత్ర చూడముచ్చటగా జరుపుకున్నారు. రథాన్ని రంగు రంగు పూలతో అందంగా అలంకరించి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ప్రతిష్ఠించుకుని భక్తులు శివనామస్మరణ చేస్తూ రథాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు. రథోత్సవ ఉత్సవాన్ని వీక్షించేందుకు జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఉత్సవాన్ని వీక్షించారు. ఉత్సవాలు ప్రశాంతంగా, ఘనంగా ముగిసేలా డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు, నిఘాను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ రంగారావు, ఆలయ ఇఓ శశిధర్, జహీరాబాద్ టౌన్ సిఐ రవి, రూరల్ సిఐ మోహినుద్దీన్, జహీరాబాద్, హద్నూర్, రాయికోడ్, చరాక్‌పల్లి, కోహీర్, ఝరాసంగం పోలీసు ఠాణాల ఎస్ఐలు ప్రసాద్, రాము నాయుడు, వెంకట్‌రెడ్డి, నరేష్, కృష్ణగౌడ్, రాజేందర్‌రెడ్డి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గన్నారు.


ఝరాసంగంలో రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే


సీసీ రోడ్లకు భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, మార్చి 11 ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్ పట్టణంలో బాల సదానం భవనానికి రూ.కోటి యాభై లక్షలు, పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి కాంజీపూర్ తండా రోడ్డు వరకు రూ. రెండు కోట్లు, బసవేశ్వర చౌరస్తా నుంచి ముదిరాజ్ భవనం వరకు రెండు వరుసల రోడ్డు, డివైడర్ బట్టర్‌ఫ్లై లైట్లు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.ఐదు కోట్లు మంజూరయ్యాయి. దీంతో ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. ఈ నిధులు టీయుఎఫ్.ఐడీసీ నిధులకింద మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రైతులకు అనేక సంక్షేమ పథకాలు మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీద బడుగు వర్గాల వారికోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటారని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కార్యకర్తలే బాగుపడ్డారని ప్రజలకు న్యాయం చేయలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే కొన్ని అమలుచేశామని మిగితావి త్వరలో అమలు చేసి తీరుతామన్నారు. ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలం తో పాటు రూ.5 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. పేదలకు గృహలక్ష్మి, ఉచిత కరెంటు, రైతు రుణ మాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీలో రూ.10 లక్షలు వరకు బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌స్వరూప్ శెట్కార్, వైస్‌ఛైర్మన్ దారం శంకర్‌సేట్, నారాయణఖేడ్ పార్టీ మండల అధ్యక్షుడు తాహేర్‌అలీ, మున్సిపల్ కౌన్సిలర్లు నర్సింలు, మజీద్, నర్సింలు, రాజేష్, వివేకానంద, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, శంకర్‌ముదిరాజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.


కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి సురేశ్ శెట్కార్‌ను సన్మానిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు బిరదార్ దత్తు

## సురేశ్‌శెట్కార్‌ను సన్మానించిన యూత్ కాంగ్రెస్ నేత

**మనూర్, మార్చి 11, ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్ కుమార్ శెట్కార్‌ను భారీ మెజార్టీతో పార్లమెంట్ మెట్లు ఎక్కేలా ఓటర్లు ఆశీర్వదించేందుకు ప్రతి పార్టీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఉందని యూత్ కాంగ్రెస్ నాయకులు దత్తు అన్నారు. సోమవారం ఎంపి అభ్యర్థి సురేశ్‌శెట్కార్‌ను దత్తు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## గురుపాదగుట్ట శివాలయంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం


భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**పెద్దశంకరంపేట, మార్చి11 ప్రభాతవార్త:** గురుపాదగుట్ట శివాలయంలో మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయంలో పుణ్యహ వచనం, హోమం, భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, ఆకుల పూజ, అన్న పూజ, గణపతి హవనం తదితర కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చరణలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చి స్వామివారికి నైవేద్యాలు, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ నెల 12న ఉదయం భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, సాయంత్రం 4 గంటలకు బండ్లు తిరుగుట కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బలరాం, సంగమేశ్వర్, ఆలయ కమిటీ అధ్యక్షులు గుజ్జరి కనకరాజు, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## రామాయపల్లిలో మల్లికార్జునస్వామి జాతర

**వెల్దుర్తి, మార్చి 11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రామాయపల్లి గ్రామంలో సోమవారం మల్లికార్జున స్వామి జారత ఉత్సవాలను ఆ గ్రామ యాదవ సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, మండల నాయకులు నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేష్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కిష్టాగౌడ్, నాయకులు మల్లేశం, కృష్ణతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించుకొని మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో యాదవులు మల్లన్న జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారని, యాదవుల ఆరాధ్య దైవమైన మల్లన్న, బీరప్ప స్వాముల జాతర ఉత్సవాలను నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు.


మల్లికార్జునస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు


బీరప్ప ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

## బీరప్ప జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

**వెల్దుర్తి, మార్చి 11 ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా కుర్మ కులస్తులు జాతర ఉత్సవాలు జరుపుకోవడం సంతోషించదగ్గ విషయమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం వెల్దుర్తిలోని శేరిలా గ్రామంలో కుర్మ కులస్తులు వారి ఆరాధ్య దైవమైన బీరప్ప జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. డోలుచప్పుళ్లు, టపాసులు, పోతరాజుల నృత్యాలతో శేరిలా గ్రామంనుండి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించిన బీరప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి జాతర ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుర్మ కులస్తులు తమ గ్రామానికి సీసీ రోడ్డు కావాలని తెలుపడంతో స్పందించిన ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి వెల్దుర్తి నుండి శేరిలా వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంగళపర్తిలో జరుగుతున్న జాతర ఉత్సవాల్లో సైతం పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అశోక్‌గౌడ్, తాజా మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచులు శంకర్‌రెడ్డి, శేఖర్, నాయకులు కృష్ణాగౌడ్, వెంకటేశం, శ్రీనివాస్‌రెడ్డి, యాదాగౌడ్, నెల్లూరు, కొమురయ్య, శేఖులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**చిన్నశంకరంపేట, మార్చి 11,ప్రభాతవార్త:** మండల పరిధిలోని గ్రామాలలో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి సోమవారం పరామర్శించారు. సూరారం గ్రామానికి చెందిన కంసమ్మ, పోచయ్య మరణించగా వారి కుటుంబాలను, పెంటయ్య, కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన సిద్దిరాములు మరణించగా వారి కుటుంబాలను పద్మారెడ్డి పరామర్శించారు. వారి కుటుంబాలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పట్లోరి రాజు, నాయకులు లక్ష్మారెడ్డి, అయ్యోరి లక్ష్మణ్, పీఏసీఎస్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సత్యంగౌడ్, ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్, నాయకులు పోచయ్య, మంచాల లక్ష్మణ్, ఉపేందర్‌రెడ్డి, సుధాకర్ నాయక్, కిష్టారెడ్డి, విజయ్‌రాజు, ప్రసాద్, మధు, రవి,శ్రీను, నవీన్,గొల్ల నరేష్ పాల్గొన్నారు.

## విద్యార్థులే టీచర్లయిన వేళ

**రామాయంపేట, మార్చి 11, ప్రభాతవార్త :** ప్రాథమిక పాఠశాల కోనాపూర్ నందు సెల్ఫ్ గవర్నమెంట్ డే జరుపుకోవడం విద్యార్థులందరూ ఆనందంగా అనుభూతి చెందారని పాఠశాల హెచ్ఎం ఐరేని రవీందర్‌గౌడ్ తెలియజేశారు. ప్రతి విద్యార్థి క్లాసులో విద్యార్థిగా ఉన్నంతసేపు టీచర్లు బోధించే విధానం ఎంతో సులభంగా అనిపించేది కానీ టీచర్ల స్థానంలో మేము ఉండి టీచర్లు ఎంత ఓపికగా, శ్రద్దగా, అందరికీ అర్థమయ్యే విధంగా బోధన చేస్తున్నారో మాకు అర్థమైందని విద్యార్థులు తెలియజేశారు. హెచ్ఎంగా పి.సాయి ప్రణీత్, టీచర్లుగా వర్షిని, మౌనిక, కీర్తన, శివవర్ధన్, అవంతిక, సంజయ్‌కుమార్, అన్వేష్, నవీన్‌లు పాల్గొన్నారు. అనంతరం టీచర్లుగా పాల్గొన్న విద్యార్థులకు మెమొంటోలు, మెడల్స్ ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలు ప్రతి రంగంలోనూ రాణించాలి

**చిన్నశంకరంపేట,మార్చి 11,ప్రభాతవార్త:** నేడు మహిళలు అన్ని రంగాలలో గొప్పగా రాణిస్తున్నారని పద్మశాలి సంఘం పట్టణ గౌరవ అధ్యక్షులు తుమ్మ సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చిన్నశంకరంపేటలోని ప్రాథమిక పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కిష్టయ్య, పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.


మహిళా ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న దృశ్యం


ఏడుపాయల వనదుర్గ భవాని మాత ఆలయ హుండీని లెక్కిస్తున్న దృశ్యం

## జాతర హుండీ ఆదాయం రూ. 61.18 లక్షలు

**పాపన్నపేట, మార్చి 11, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయంలో మహాశివరాత్రిని పర్వదినాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించిన మహా జాతరకు భక్తులు అమ్మవారికి చెల్లించుకున్న కానుకలను సోమవారం లెక్కించారు. హుండీలను లెక్కించగా రూ. 61,18,180 ఆదాయం ఆలయానికి సమకూరినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంటు కమిషనర్ శివరాజ్, ఇన్స్‌పెక్టర్ రంగారావు, ఆలయ కమిటీ ఛైర్మన్ బాలగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. హుండీని గోకుల్‌షెడ్‌లో రాజరాజేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో లెక్కించినట్లు వివరించారు. బంగారు, వెండి వస్తువుల మినహా నగదు రూపంలో 24,75,366 రూపాయలు భక్తులు కానుకల రూపంలో వచ్చినట్లు తెలిపారు. ప్రసాదాల విక్రయాల ద్వారా 25లక్షల 99వందలు, ప్రత్యేక దర్శనాల ద్వార రూ. 9,95,720, కేశ ఖండనం ద్వార రూ. 59,250 ఒడి బియ్యం ద్వార 77,950 రూపాయల ఆదాయం సమకూరగా వివిధ విక్రయాలు, ప్రత్యేక దర్శనం టికెట్లు, కేశఖండనం, టికెట్లు, ప్రసాద విక్రయాల ద్వారా రూ. 36,42,820 ఆదాయం సమకూరిందన్నారు. 14 రోజుల హుండీతో పాటు 61,18,186 రూపాయల ఆదాయం ఆలయానికి సమకూరినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు వెంకటేశం, మనోహర్, చక్రపాణి, మోహన్‌రావు, పెంటయ్య, నాగభూషణం, రఘు, యాదయ్య, సాయిలు, బాగారెడ్డి, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, లక్ష్మీ నారాయణ, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్ శర్మ, యాదగిరి, రాజరాజేశ్వరి సేవా సమితి సభ్యులు పాల్గొనగా పాపన్నపేట పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## మల్లికార్జున స్వామి హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న దృశ్యం

**అమీన్‌పూర్, మార్చి 11 ప్రభాతవార్త:** శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. అమీన్‌పూర్ మండలం బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం ఆదాయం రూ. 27,19,732 వచ్చినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ సుధాకర్ యాదవ్ వెల్లడించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు హుండీల్లో వేసిన డబ్బులు, టికెట్ల ద్వారా వచ్చిన డబ్బులను అందరి సమక్షంలో లెక్కించినట్లు చెప్పారు. హుండీ ద్వారా 10 లక్షల 34 వేల 342 రూపాయలు రాగా, టికెట్ల ద్వారా 16 లక్షల 85 వేల 390 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. గత ఏడాది కంటే రూ.2 లక్షల ఆదాయం పెరిగిందన్నారు. స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆలయ ఈవో శశిధర్, ఆలయ అధికారులు, కాంగ్రెస్ పార్టీ అమీన్‌పూర్ అధ్యక్షులు శశిధర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రేపు 14వ ఉపాధి హామి సామాజిక తనిఖీ

**న్యాల్‌కల్, మార్చి 11, ప్రభాతవార్త:** ఈనెల 13వ తేదీన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాల్‌కల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సామాజిక తనిఖీ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. 1 ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2023 వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధిహామి పనులపై నిర్వహించిన సర్వేపై ఎంపిపి అధ్యక్షురాలు అంజమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రజా ప్రతినిధులు, గ్రామాల ప్రత్యేక అధికారులు సమావేశానికి హాజరు కావాలని ఎంపిడిఓ సూచించారు.

## తోర్నాల్‌లో సిసి రోడ్డు పనులకు శ్రీకారం


తోర్నాల్‌లో సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేతలు

**మనూర్, మార్చి 11, ప్రభాతవార్త:** మండలంలోని తోర్నాల్ గ్రామంలో ఎమ్మెల్యే నిథుల నుంచి సిసి రోడ్డు నిర్మాణానికి సోమవారం కాంగ్రెస్ నాయకులు భూమి పూజాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచనల మేరకు గ్రామంలో అవసరమున్న ప్రాంతంలో సిసి రోడ్డును నిర్మించేందుకు పనులు ప్రారంభించినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బస్వరాజ్, న్యాయవాది, మాజీ ఎంపిటిసి సభ్యులు, మాజీ సర్పంచ్ సంగారెడ్డి, మల్లికార్జున్ పాటిల్, సంగమేశ్వర్ పాటిల్, గూడూరు వైజనాథ్, అంబోజి, నాగశెట్టి పాటిల్, శివయ్య స్వామి, కాలేద్, కార్ బసప్ప, కుశప్ప, చందు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా ఆది దంపతుల కళ్యాణోత్సవం

**చిన్నశంకరంపేట, మార్చి 11,ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర ఆలయ 53వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం నాడు ఆది దంపతులైన శివ, పార్వతుల కళ్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపారు. ఈ కళ్యాణోత్సవాన్ని వేద పండితుల మధ్య, డప్పు వాయిద్యాలు,బాజా భజంత్రిలతో వందలాది మంది భక్తుల మధ్య శివ పార్వతుల కళ్యాణాన్ని జరిపారు. పట్టణ తాజా మాజీ సర్పంచి రాజిరెడ్డి దంపతుల చేతుల మీదుగా వేద పండితుల ఈ కళ్యాణోత్సవాన్ని జరిపించారు. అనంతరం అన్నధాన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిగుండాలు, రథోత్సవ కార్యక్రమాన్ని పట్టణంలోని పురవీధుల గుండా తిప్పుతూ జరిపించారు.

# ప్రభుత్వ భూములను కాపాడాలి

## కలెక్టరేట్ వద్ద సిపిఐ నాయకుల నిరసనలు.. గతంలో ఫిర్యాదు చేసిన స్పందన కరువు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 11, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, చెరువులు,కుంటలు కబ్జాలు అవుతున్నాయని, గత రెండేళ్ల నుంచి జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణిలో పలుసార్లు ప్రభుత్వ భూములు కాపాడాలని ఫిర్యాదులు చేసినా అధికారుల స్పందన లేదని దీన్ని నిరసిస్తూ ప్రజావాణిలో గతంలో ఇచ్చిన ఫిర్యాదు పత్రాలను ఇక్కడే దగ్దం చేయటం జరిగిందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ఉమా మహేశ్ పేర్కొన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద సిపిఐ నాయకులు ప్రభుత్వ భూములు కాపాడాలంటూ చెరువు,కుంటలు కబ్జాలు అవుతున్నట్లు వాటిని అరిక ట్టాలని, ప్రజావాణిలో పలు సార్లు ఫిర్యాదులు చేసిన అధికారులు స్పందించకపో వటం దారుణమని నిరసిస్తూ ఆ ఫిర్యాదు, వినతి పత్రాలను దగ్దం చేస్తున్నా మన్నా రు. గత రెండేళ్ల నుంచి పోరాడుతున్నా అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోకపోవటం దారుణమన్నారు. ప్రజావాణిలో ఇచ్చి ఫిర్యాదు పత్రాలకు విలు వలు లేకుండ పోతున్నాయని, చెత్తబుట్టలో వేసినట్లు అవుతుందని, వీటిని దగ్దం చేస్తున్నామన్నారు. సిపిఐ కార్యదర్శి ఉమా మహేశ్, కార్యవర్గసభ్యులు హరినాథ్‌లు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు,చెరువులు, కుంటలు ఉన్నట్లు చాలా చోట్ల కబ్జాలకు గురైనట్లు సిపిఐ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములు కాపాడాలని అదికారులకు వినతిపత్రాలు ఇస్తూ వస్తున్నామని అధికారుల స్పందన కరువైందన్నారు. ప్రభుత్వ భూములను, చెరువు,కుంటలను కబ్జాల నుంచి కాపాడాలని అధికారులను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు శ్రీనివాస్,ప్రవీణ్, సహదేవ్‌రెడ్డి, మండల నాయకులు ఇమామ్, నర్సింహ్మారెడ్డి, ప్రభాకర్, సామెల్, ఆశప్ప, సతీష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న సిపిఐ నాయకులు

## టిప్పర్ బోల్తా.. ఒకరి మృతి

**అల్లాదుర్గం, మార్చి 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముస్లాపూర్ గ్రామ శివారులో టిప్పర్ బోల్తాపడి ఒక వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం... ముస్లాపూర్ గ్రామ శివారులో క్రషర్‌లో టిప్పర్ అదుపుతప్పి రోడ్డు పక్కనగల గుంతలో పడిందన్నారు. టిప్పర్‌ను తోలుతున్న బీహార్ రాష్ట్రం కావే గ్రామానికి చెందిన డ్రైవర్ రాజీ అహ్మద్(44) అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు.

ముస్లాపూర్ గ్రామ శివారులో బోల్తా కొట్టిన టిప్పరు
